## భీమారంలో శిలాఫలకం ధ్వంసం

భీమారం, ఏప్రిల్ 17 : ఇప్పల బోగుడ సమీపంలో గతేడాది రూ.3 కోట్ల పనులకు మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ శంకుస్థాపన చేశారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో మండలంలో గందరగోళ పరిస్థితి నెలకున్నది. ధ్వంసం చేసే సంస్కృతి ఎంటని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


ఘటన స్థలంలో ధ్వంసం చేసిన ఆనవాళ్లు

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి..

చెన్నూర్, ఏప్రిల్ 17 : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఫైర్ అధికారి రాజేందర్ అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా చెన్నూర్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏలా నివారించాలనే విషయమై వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు చెన్నూర్ అగ్ని మాపక కేంద్రం సెల్ నంబర్ 8712699201, 8712699200 ల్యాండ్ ఫోన్ నంబర్ 08737-242101లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మన్ రమేశ్‌బాబు, ఫైర్‌మన్ ఆపరేటర్లు బానయ్య, మధూకర్, ఫైర్‌మన్ సుధాకర్, తహేర్‌పాష, ఇగ్బాల్, నాగరాజు పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

# గెలిచేది బీఆర్ఎస్సే..

## ఎగిరేది గులాబీ జెండానే..


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

**ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడి మధ్య పోటీ..**

- పెద్దపల్లిలో కాంగ్రెస్‌ను ఓడించాలి..
- బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి..
- రాష్ట్రంలో రోజురోజుకు కేసీఆర్ గ్రాఫ్ పెరుగుతోంది..
- గడ్డం ఫ్యామిలీ పెద్దపల్లికి చేసిందేం లేదు.. చేయబోయేది ఏం లేదు..
- సింగరేణి కార్మికుల పక్షాన నిలిచేది బీఆర్ఎస్ ఒక్కటే..
- బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఇంటర్వ్యూ

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

*'పార్లమెంట్ ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీయే గెలుస్తోంది. రాష్ట్రంలో రోజురోజుకు కేసీఆర్ గ్రాఫ్ పెరుగుతోంది. పెద్దపల్లి అభ్యర్థిగా నన్ను చూసినప్పుడు నేను సింగరేణి కార్మికుడిని, ఉద్యమ కారుడిని, ఒక సామాన్య మనిషిని.. ఒక్కసారి అవకాశం ఇస్తే అద్భుతంగా చేసి చూపిస్తా. ఏ రకమైన అవినీతి ఆరోపణలు లేవు. 30 ఏండ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిని. అవతలి వైపు చూస్తే కాంగ్రెస్ అభ్యర్థి వంశీ ఓ కార్పొరేట్ వ్యవస్థ నుంచి వచ్చినోడు. అతడికి ఆకలి విలువ తెలుసా? ప్రజల కష్టం తెలుసా? ఎండ తెలుసా? వ్యవసాయం తెలుసా? వడ్లు ఎట్ల పుడుతయే తెలుసా? వాళ్ల కోసం, వాళ్ల ఆస్తుల రక్షణ కోసం పదవులు తప్ప.. ప్రజల కోసం కాదనేది ప్రజలకు అర్థమైంది. అందుకే ఈ ఎన్నికల్లో తప్పకుండా కాంగ్రెస్ పార్టీని ఓడించాలి. అలాగే బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తెలంగాణ ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. మీ హక్కుల కోసం, మీ ఆత్మగౌరవం కోసం పోరాడే మీ ఇంటి పార్టీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి' అని బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఈయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..*

*- మంచిర్యాల, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**నమస్తే తెలంగాణ : బీఆర్ఎస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలి?**

**పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ :** బీఆర్ఎస్‌కు ఉద్యమ పార్టీగా గుర్తింపు ఉంది. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఈ ప్రాంతం కరవు కాటకాలతో అల్లాడేది. నీళ్లు లేక, కరెంట్ రాక, వ్యవసాయం సాగక రైతుల వలసలు వెళ్లేవారు. ఒకవైపు రైతుల ఆత్మహత్యలు, మరోవైపు చేనేత కార్మికుల ఆత్మహత్యలతో తల్లడిల్లింది. కేసీఆర్ తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి సహించలేక 2001లో తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టారు. 14 ఏండ్ల ఉద్యమంలో అనేక ఘట్టాలు, ఎన్నో అవమానాలు.. ఇవన్నీ తట్టుకుని తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేశారు. సాధించుకున్న తెలంగాణను గాలికి వదిలిపెట్టలేదు. పదేళ్లలో దేశంలో ఎక్కడా జరగనటువంటి అభివృద్ధిని తెలంగాణలో చేశారు. ఉదాహరణకు.. ఒక ఇరిగేషన్ రంగం చూసుకుంటే గత పాలకులు 60 ఏండ్లు చేతులు ఎత్తేశారు. తెలంగాణకు నీళ్లు ఎక్కడివి అయ్యా.. మీకు బోర్లు, బావులే దిక్కు అన్నరు. మరి కరెంట్ అన్న ఇయ్యండి అంటే కరెంట్ కూడా ఇవ్వని దుస్థితి. కానీ.. ఈ రోజు అటు గోదావరి, ఇటు కృష్ణ నదుల్లో ఉన్న నీటిని ఒడిసిపట్టి కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుతోపాటు 23 భారీ ప్రాజెక్టులను కేసీఆర్ పూర్తి చేశారు. ఒకనాడు 42 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తే.. నేడు 1.20 కోట్ల ఎకరాల్లో పంటలు పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, ఆసుపత్రుల ఏర్పాటు, జిల్లాకో మెడికల్ కాలేజీ, పీహెచ్‌సీల అభివృద్ధి, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి.. ఇవన్నీ కూడా ఒక కాన్సెప్ట్‌తో చేసినయ్. ఈ విషయాలన్నీ ప్రజల మనసుల్లో ఉన్నయ్. అందుకే బీఆర్ఎస్‌కు ఓటేయాలే.

**నమస్తే : నాలుగు నెలల కాంగ్రెస్ పాలన.. వారిచ్చిన హామీల అమలుపై మీరేమంటారు?**

**ఈశ్వర్ :** కాంగ్రెస్‌కు ఓటేస్తే ఏం జరిగిందనేది ఈ నాలుగు నెలల పరిపాలనలో మనం చూసినం. అన్నీ అబద్ధాల వాగ్దానాలు చేశారు. చేసిన హామీలపై చిత్తశుద్ధి లేదు. ఆరు గ్యారెంటీల్లో ఒక్క గ్యారెంటీ నెరవేర్చలేదు. మొన్నటి దాకా గొప్పగా ఉన్న వ్యవసాయ రంగం కుప్పకూలింది. 209 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. 50 లక్షల మంది ఆటో కార్మికులు అథోగతి పాలయ్యారు. నిధులు లేవు. పింఛన్లు రావడం లేదు. రైతుబంధు వస్తలేదు. కల్యాణలక్ష్మి తులం బంగారం దిక్కులేదు. నాలుగు నెలల్లోనే ఈ ప్రభుత్వ విధానం తెలిసింది. అందుకే ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు ఓటేసేందుకు ప్రజలు ముందుకు రారు. ఉద్యోగులకు ఫస్ట్ తారీఖున జీతం ఇస్తా అన్నారు కానీ ఇవ్వడం లేదు. ప్రగతి భవన్ బద్దలు కొట్టినం. ప్రజాపాలన పెడతాం అన్నారు. కానీ.. ప్రజాపాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కారమైంది లేదు. ఈ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణవాది కాదు, తెలంగాణ రావాలని కోరుకున్నోడు కాదు. ఉద్యమకారుడు కాదు. తెలంగాణ ద్రోహి. ఉద్యమ కారులపై తుపాకీ పెట్టినోడు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడినోడు. సమాఖ్య ఆంధ్రప్రదేశ్‌ను కోరిన చంద్రబాబుకు సన్నిహితుడు, శిష్యుడు ఇవన్నీ జనాలకు తెలుసు. వీళ్లు ఏదో ఘనకార్యం చేశారని అధికారంలోకి రాలేదు. ప్రజలు మార్పు కోరుకున్నరు అంతే.. దాన్ని మరిచిపోయి ఇవాళ మంత్రులు, ముఖ్యమంత్రి మాట్లాడుతున్న అహంకారపు మాటలు చూసి ప్రజలే అసహించుకుంటున్నరు.

**నమస్తే : ఒకే కుటుంబంలో ముగ్గురికి టికెట్లు ఇవ్వడంపై మీ కామెంట్..**

**ఈశ్వర్ :** కాంగ్రెస్ పార్టీలో నిజంగా రిజర్వేషన్ అనేది ఉంటే ఆ కుటుంబంలో ఒక్కరికే టికెట్ రావాలే. అందులో వివేక్ కుటుంబం అనేది దేశంలోనే 9వ స్థానంలో ఉన్న అత్యంత ఆస్తిపరులు, కుబేరులు. వాళ్లకు నిజంగా ఈ రిజర్వేషన్ అనుభవించే హక్కు కూడా లేదు. కానీ.. ఈ రిజర్వేషన్ పేరు చెప్పుకొనే కుటుంబం మొత్తం 76 సంవత్సరాలుగా జనాల్ని పట్టి పీడిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉంటే రెండు స్థానాల్లో వాళ్లే ఉన్నరు. పార్లమెంట్ కూడా వాళ్లే తీసుకోవడం ఎంత వరకు న్యాయం. మాదిగ, మాల సామాజిక వర్గాల్లో ఎంతో మంది చదుకున్నోళ్లు, యోగ్యులు ఉన్నారు. వాళ్లకు అవకాశం ఇస్తే నాయకులుగా ఎదిగే ఆస్కారం ఉంది. కానీ.. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. అసలు ఎందుకు వివేక్ కుటుంబం ఇక్కడికి రావాలి. కార్పొరేట్ రాజకీయం ప్రజల మీద రుద్ది, అవసరం ఉన్నప్పుడు డబ్బులు తీసుకువచ్చి, ఎన్నికల్లో గెలిచి ఏమైనా చేస్తారా అంటే ఏం లేదు. మీ తాత, మీ పెద్దనాయన, మీ నాన్న మరి ఇక్కడ ఏం చేశారు. మీకు వందల పరిశ్రమలు ఉంటే ఇక్కడ ఒక పరిశ్రమ ఎందుకు పెట్టలేదు. ఉద్యోగాలు ఎందుకు ఇయ్యలే. కష్టం వస్తే రారు. మీరు వీకెండ్ లీడర్స్. మీరు వస్తే మీకు హాలిడే కావాలి. కార్పొరేట్ ఆఫీస్ కావాలే. పొద్దున లేస్తే మీరు కార్పొరేట్ ఆఫీస్‌కు పో తరు. హైదరాబాద్‌కు పోయినా దొరకరు. ఎందుకోసం మీకు ఓటేయాలి.

**నమస్తే : గడ్డం కుటుంబం కారణంగానే మాకు నష్టం జరిగిందని మాదిగ, మాల సామాజిక వర్గాలు అంటున్నాయ్. దీనిపై మీ అభిప్రాయం.**

**ఈశ్వర్ :** గడ్డం వంశీకి పెద్దపల్లి ఎంపీ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మాదిగ, మాల, నేతకాని సామాజిక వర్గాలకు తీవ్రమైన అన్యాయం చేసింది. మాల సామాజిక వర్గానికి ఇక్కడ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. పోనీ మిగిలిన రెండు చోట్ల మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలి కదా.. కానీ.. ఎందుకు ఇవ్వలేదు. సంఖ్యాపరంగా కూడా మాదిగ సామాజిక వర్గం ఎక్కువ ఉన్నది కదా.. ఇదేనా సామాజిక న్యాయం అని నేను ప్రశ్నిస్తున్నా. వీళ్లు తప్ప ఎవ్వరు లేరా.. మొన్నటి దాకా కుటుంబ పాలన అని కేసీఆర్‌ను అన్నరు కదా. దీన్ని ఏమంటరు మరీ. చెప్పడానికే నీతులా.. పాటించడానికి కాదా.. ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అదే బీఆర్ఎస్ పార్టీ వరంగల్, నాగర్‌కర్నూల్‌లో రెండు టికెట్లు ఇచ్చింది. ఇదే సామాజిక న్యాయం మీ పార్టీలో ఎందుకు లేదు. పైసలుంటే సామాజిక న్యాయం అయిపోతదా.. అక్కడ ఏఐసీసీని కొన్నరు. ఇక్కడున్న ఏడుగురు ఎమ్మెల్యేల్లో మీ ఇద్దరుపోతే ఐదుగురు ఎమ్మెల్యేలను కొన్నరు. పైసలు ముట్టినంకనే వాళ్లు ఒకే అని తల ఊపారు. రేపు మళ్లీ పదవిని కూడా కొంటరు. అందుకే మేం అంటున్నాం.. ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ కార్మికుడిగా ఉన్న కొప్పుల ఈశ్వర్‌కు మధ్యే పోటీ.

**నమస్తే : బీజేపీకి గుణపాఠం చెప్పాలని మీరు ప్రజలకు పిలుపునిస్తున్నారు? అలా చెప్పడం వెనుక కారణం ఏంటీ?**

**ఈశ్వర్ :** బీజేపీ తెలంగాణకు ద్రోహం చేసింది. నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యాక అనేక సందర్భాల్లో తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ మాట్లాడారు. తెలంగాణ రావడమే ఆయనకు ఇష్టం లేదు. కొత్త రాష్ట్రం గొప్పగా ఎదగాలని ముఖ్యమంత్రిగా కేసీఆర్ వారు తీసుకున్న ఎన్నో నిర్ణయాలను సమర్థిస్తూ, స్నేహ సంబంధాలు కొనసాగించినప్పటికీ మమ్ములను తొక్కేయాలని, నిధులు ఇవ్వకుండా, వేధింపులకు గురి చేశారు. ఈ రోజుకు కూడా ఈడీ కేసులు బనాయించుకుంటా ఇబ్బందులు పెడుతున్నారు. అది పక్కన పెడితే ఈ రాష్ట్రానికి ఏమన్నా చేశారా అంటే అదీ లేదు. నిజాయితీగా రావాల్సిన నవోదయ పాఠశాల ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వలేదు. ఐటీఐఆర్ బెంగళూర్‌కు తరలించారు. మాకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీ రాకుండా చేశారు. బీఆర్ఎస్ పార్టీని, నాయకత్వాన్ని మింగేయాలని.. ఇంత గొప్పగా ప్రజలకు సేవలు అందించినా కూడా మా మీద అధికార బలాన్ని చూపిస్తున్నరు. తెలంగాణకు బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసింది ఏం లేదు. ఎన్నడూ కూడా తెలంగాణపై వారికి ప్రేమ లేదు. అలాంటప్పుడు ఈ ఎన్నికల్లో బీజేపీకి ఎందుకు ఓటేయాలి. జనమే ఇది ఆలోచించాలి.

**నమస్తే : సింగరేణి కార్మికులకు మీరిచ్చే పిలుపు ఏంటీ?**

**ఈశ్వర్ :** మోదీ ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేసేందుకు చేసిన కుట్రలను అడ్డుకున్న బీఆర్ఎస్ పార్టీ.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఓటు వేస్తే సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి గట్టిగా పోరాడుతాం. ఐటీ సమస్యను తప్పకుండా పరిష్కరించొచ్చు. కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాల్సిన అవసరం లేదు. సింగరేణి సంస్థనే దాన్ని సర్దుబాటు చేయొచ్చు. సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత కోసం, పొల్యూషన్ కంట్రోల్ కోసం కచ్చితమైన చర్యలు తీసుకునేలా పోరాటాలు చేస్తాం. కార్మికులుగా రిటైరయ్యాక కూడా అక్కడే ఉంటున్నవాళ్లు, కనీసం ఇల్లు కూడా లేని వాళ్లకి ప్రస్తుతం వాళ్లు ఉంటున్న స్థలాలను, క్వార్టర్లను వారికే ఇవ్వాలనే విషయంలోనూ కార్మికుల పక్షాన నిలబడతాం. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి కార్మికుల కోసం అనేక కార్యక్రమాలు చేశాం. 15 వేల కటుంబాలకు కారుణ్య నియామకాలు ఇచ్చాం. వేల మందికి పట్టాలు ఇచ్చాం. లాభాల్లో వాటా పంపిణీ చేసినం. ఇవన్నీ మా ప్రభుత్వం ఉన్నప్పుడే జరిగాయి. కార్మికులకు ఒకటే చెప్తున్నా.. మీ పక్షాన నిలబడుతాం. మన కోసం ఆలోచించే పార్టీని, నాయకులను కాపాడుకోవాలని పిలుపునిస్తున్నా. సింగరేణి కార్మికుల సమస్యలపై త్వరలోనే ఓ నిరసన దీక్ష నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. అన్ని వర్గాలకు కలుపుకుని ఈ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచి చూపిస్తాం.

## ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. రూ. లక్ష విరాళం

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎందుకు మినహాయింపు

మంచిర్యాల, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల కోడ్ వేళ ఎవ్వరూ రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లడానికి వీళ్లేదు. సరైనా ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తే వాటిని అధికారులు సీజ్ చేస్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రం ఈ విషయంలో మినహాయింపు ఉన్నట్లు ఉంది. మొన్నీ మధ్యే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మంచిర్యాల ఈగ్గాలో కాంగ్రెస్‌కు ఓటేయాలంటూ పిలుపునిచ్చిన ఘటన మరవకముందే.. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఓ ఆలయానికి వెళ్లిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. పాత మంచిర్యాలలోని ఓ ఆలయానికి పేయింటింగ్ వేసేందుకు ఈ మొత్తం ఇచ్చినట్లు చెప్తున్నారు. కాగా.. ఎన్నికల కోడ్ ఉండగా ఓటర్లను ప్రభావితం చేసేలా ఎలాంటి డబ్బులు పంపిణీ చేయకూడదనే నిబంధన ఉంది. కానీ.. దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఎమ్మెల్యే ఆలయానికి డబ్బులు ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇలా వరుసగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే ఇలా డబ్బులు విరాళంగా అందించవచ్చా అనే అంశాలపై మంచిర్యాల ఎన్నికల అధికారి ఆర్డీవో రాములును వివరణ కోరేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.


మంచిర్యాలలో ఓ ఆలయానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

## కార్మిక సంఘంగా కొనసాగిస్తాం..

- కార్మికుల హక్కులు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతాం..
- 24న గోదావరిఖనిలో కేంద్ర జనరల్ బాడీ సమావేశం
- లాభాలు తెచ్చిన ఉద్యోగులకు బంగారు నాణేలు జ్ఞాపకంగా ఇవ్వాలి..
- టీబీజీకేఎస్‌కు బలం సింగరేణి కార్మికులే..
- కేంద్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 24 : సింగరేణిలో మరోసారి కార్మిక వర్గం కోసం పోరాటానికి సిద్ధమవుతున్నామని, రాజకీయ పంథాలో కాకుండా కార్మిక సంఘంగా కొనసాగిస్తూ ముందుకు వెళ్తామని టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నెల 24న గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే టీబీజీకేఎస్ కేంద్ర జనరల్ బాడీ సమావేశం వాల్ పోస్టర్‌ను రాజిరెడ్డి విడుదల చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే సింగరేణి గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ పోరాడుతుందన్నారు. బీఆర్ఎస్ సహాయ, సహకారాలతో స్నేహపూర్వకంగా ఉంటామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడాన్ని విరమించు కోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకే కేంద్ర ప్రభుత్వం గనులు కేటాయించాలన్నారు. గతంలో గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడామని, సమ్మెలు చేశామన్నారు. యాజమాన్యం కూడా గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ, సింగరేణికి గనులు కేటాయించాలని నిర్ణయించిందన్నారు. కార్మికులకు ఐటీ మినహాయించాలని, యాజమాన్యం తిరిగి చెల్లించాలన్నారు. కార్మికులందరికీ డిజిటల్ మెడికల్ కార్డులు అందించాలని, దాని ఆధారంగానే కార్మికుడు కోరుకున్న కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సింగరేణి సంస్థ రికార్డు స్థాయిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని చెప్పారు. లాభాలు తెచ్చిన ఉద్యోగులందరికీ ఒక జ్ఞాపికగా బంగారు నాణెం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు కొమురయ్య, రవి, పెట్టం లక్ష్మణ్, పానగంటి సత్తయ్య, గొర్ల సంతోష్, తొంగల రమేశ్, సాదుల భాస్కర్, అన్వేష్‌రెడ్డి, ఏరియా స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఉత్తేజ్‌రెడ్డి, నరేశ్, పొగాకు రమేశ్, సత్తన్న, మారం శ్రీనివాస్, రాజునాయక్ పాల్గొన్నారు.



టీబీజీకేఎస్ జనరల్ బాడీ పోస్టర్‌ను విడుదల చేస్తున్న స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి


మంచిర్యాల విశ్వనాథస్వామి ఆలయంలో కల్యాణానికి హాజరైన భక్తులు


సీతారాముల విగ్రహమూర్తులు

## కనుల పండువగా రాములోరి లగ్గం

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా కొనసాగింది. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పెండ్లితంతు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షామీయాలలో కూర్చొని భక్తులు వేడుకను తిలకించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. హనుమాన్ భక్తులు, యూత్ మండలి సభ్యులు శ్రీరాముని ప్రతిమలు, జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. పల్లకీ సేవ నిర్వహించారు. హనుమాన్ దీక్షాదారులు కూడా శోభాయాత్రయలో పాల్గొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, ప్రసాదం, అంబలి, మంచినీరు, జ్యూస్‌లను భక్తులకు ఉచితంగా అందించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కల్యాణ మహోత్సవానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, బెల్లం పాణకం, వడపప్పు వితరణ చేశారు. **- నెట్‌వర్క్**

## ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలి..

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

లక్షెట్టిపేట, ఏప్రిల్ 17 : ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలని, రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోళ్లు చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. లక్ష్మీపూర్ గ్రామంతోపాటు మరికొన్ని గ్రామల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని, కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట డీఆర్‌డీవో కిషన్, డీపీఎంలు వేణుగోపాల్, స్వర్ణలత, సంజీవ్, రమేశ్, ఐకేపీ ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.

### నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి..

జన్నారం, ఏప్రిల్ 17 : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ సూచించారు. బుధవారం పొనకల్, బాదపెల్లి, రేండ్లగూడ, తపాలాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమం సీవో కావటి రాజన్న, ఏవో సంగీత, ఏఈవోలు అక్రముల్ల, త్రిసంధ్య పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

## ఈదురుగాలుల బీభత్సం

- బోల్తా పడ్డ కొబ్బరికాయల లారీ
- ఎగిరిపోయిన పలువురి ఇండ్ల పైకప్పులు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : బూరుగుడా గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ఒకేసారి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో పలువురి ఇంటి పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. ఇంట్లోని నిత్యావసర వస్తువులు తడిశాయి. అలాగే రేకులు ఎగిరివచ్చి పడడంతో ఎద్దు కాలుకు తీవ్ర గాయమైంది. రాజమండ్రి నుంచి చంద్రాపూర్ వెళ్తున్న కొబ్బరికాయల లారీ తీవ్రమైన గాలికి బోల్తాపడింది. విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో విద్యుత్ నిలిచింది.


గాలికి బోల్తా పడ్డ కొబ్బరికాయల లారీ